తిప్పర్తి పాఠశాలకు మహర్దశ

- రూ.10 లక్షల నిధులు విడుదల చేయనున్న కలెక్టర్
- కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాల కల్పన
- దాతల నుంచి నిధుల సేకరణకు ప్రణాళిక

తిప్పర్తి : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు మహర్దశ పట్టనుంది. నల్లగొండ నియోజవర్గంలో ఉత్తమ ఆదర్శ పాఠశాలగా తిప్పర్తి మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను ఎంపిక చేశారు. కలెక్టర్ నిధులు, దాతల సహకారంతో పాఠశాలలో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో మౌలిక వసతులు కల్పించనున్నారు.

కార్పొరేట్ స్థాయిలో వసతులు

అమ్మ ఆదర్శ పాఠశాలగా ఎంపికైన తిప్పర్తి పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దనున్నారు. పాఠశాలకు అవసరాన్ని బట్టి ప్రతి సంవత్సరం కలెక్టర్ నిధుల నుంచి రూ.పది లక్షలు మంజూరు చేస్తారు. ఈ నిధులతో ప్రతి విద్యార్థికి టై, బెల్టు, షూ, ఐడీ కార్డులను జారీ చేస్తారు. అదేవిధంగా స్కావెంజర్లు, నైట్ వాచ్‌మన్‌ను ఏర్పాటు చేస్తారు. వీటితోపాటు ఎన్‌సీసీ పరేడ్, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు ఇతర యాక్టివిటీస్ చేయించన్నారు


తిప్పర్తి మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల భవనం

ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో..

అమ్మ ఆదర్శ పాఠశాలగా ఎంపికైన తిప్పర్తి బాలుర ఉన్నత పాఠశాలలో అవసరాన్ని బట్టి కలెక్టర్ ఏటా నిధులు మంజూరు చేస్తారు. అందులో భాగంగా ప్రస్తుతం రెండు లక్షల రూపాయలను విడుదల చేశారు. ఈ నిధులతో విద్యార్థులకు టై, బెల్టు ఇచ్చారు. పాఠశాలలో సైన్స్ ల్యాబ్, గ్రంథాలయం, సౌండ్ సిస్టమ్, స్టేజీ నిర్మాణం మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. కమిటీ ఏర్పాటు చేసి మండల స్థాయి అధికారులతో ప్రత్యేక అధికారిని నియమించి నిధులను వినియోగించనున్నారు.

400 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ సహకారంతో తిప్పర్తి బాలుర ఉన్నత పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాలగా ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉంది. ప్రస్తుతం మా పాఠశాలలో 400పైగా విద్యార్థులు ఉన్నారు. వారందరికి ఇంటర్నేషనల్ స్థాయిలో విద్య అందించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. విద్యార్థులకు ఉన్నతంగా విద్య అందించేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం.

–నర్సింహనాయక్, ప్రధానోపాధ్యాయుడు

దాతల సహకారంతో మరింత అభివృద్ధి

అమ్మ ఆదర్శ పాఠశాలగా ఎంపికైన తిప్పర్తి బాలుర ఉన్నత పాఠశాలకు కలెక్టర్ మంజూరు చేసే నిధులతోపాటు దాతల సహకారంతో నిధులు సేకరించి మరిన్ని వసతులు కల్పించనున్నారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విధంగా చర్యలు చేపట్టనున్నారు.

అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల: సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ ప్రజల హక్కులకు విఘాతం కలిగిస్తోందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో నిర్వహిస్తున్న సిమెంటు పరిశ్రమ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనేందుకు వెళ్తున్న చిరుమర్తి లింగయ్యను చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామ శివారులో జాతీయ రహదారిపై పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య కారక పరిశ్రమను ఏర్పాటు చేయవద్దంటు కొన్ని రోజులుగా ప్రజలతో కలిసి అధికారులకు వినతి పత్రాలను అందజేయడంతో పాటు ఆందోళన కార్యక్రమాలను చేపడుతున్నప్పటికీ అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం తగదన్నారు. అనంతరం పోలీసులు చిరుమర్తి లింగయ్యను నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రామన్నపేటలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటుపై బుధవారం అధికారులు నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి, వెలిమినేడు గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు, గ్రామస్తులు తరలి వెళ్లారు. పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనకుండా ముందస్తుగా చిట్యాలలో పోలీసులు అరెస్ట్ చేసి కట్టంగూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాటం వెంకటేశం, మర్రి జలంధర్‌రెడ్డి, చేకూరి గణేశ్‌మాదిగ, పొట్లపల్లి నర్సింహ, చిన్నస్వామి, ముద్దసాని రమణారెడ్డి, నీలకంఠం లింగస్వామి, చింతకింది తిరుమలయ్య, మాచర్ల యాదగిరి, ఆవుల జానయ్య, కుర్రు సత్తయ్య, పున్న విష్ణు, బండారు వెంకన్న పాల్గొన్నారు.


నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

మాజీ ఎమ్మెల్యే నిర్బంధం

నాంపల్లి : రామన్నపేటలో సిమెంట్ పరిశ్రమ నిర్మాణంపై నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్తున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను పోలీసులు బుధవారం అరెస్టు చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎమ్మెల్యే అరెస్టును నిరసిస్తూ నకిరేకల్ బీఆర్‌ఎస్ నాయకులు స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ వైస్ చైర్మన్ నక్క శేఖర్, సింగిల్ విండో డైరెక్టర్ బెల్డి సత్తయ్య, నగేష్, కర్నె యాదయ్య, ఎల్లయ్య, సంజీవ, గౌరు కిరణ్, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక

నార్కట్‌పల్లి : మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో సీపీఎం గ్రామ శాఖ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ కార్యదర్శిగా దండు నాగరాజు, సహాయ కార్యదర్శులుగా అలుగుబెల్లి లింగారెడ్డి, నంద్యాల నర్సిరెడ్డి, మాదగోని సైదులు, వీరనేని శంకర్‌రావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బీజేపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదులో పాల్గొన్న శంకర్‌రెడ్డి

నకిరేకల్ : మండలంలోని గోరెంకలపల్లి, మోదినిగూడెం గ్రామాల్లో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు యానాల శంకర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు యానాల శ్రీనివాస్‌రెడ్డి, గుడుగుంట్ల సాయన్న, నలిమెల లక్ష్మయ్య, బుడిగె సైదులు, చనగాని రాములు, శ్రీకాంత్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఖనిజ సంపదను కొల్లగొడుతున్న కాంగ్రెస్'

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలో ఖనిజ సంపదను అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు కొల్లగొడుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. పట్టణం సమీపంలో ఉన్న అన్నేశ్వరమ్మ గుట్టను అక్రమంగా తవ్వి మట్టి తీసుకుపోతున్నారని అన్నారు. గుట్ట తవ్వకాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

'మంత్రిని విమర్శించే స్థాయి గాదరి కిశోర్‌కు లేదు'

కేతేపల్లి: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని విమర్శించే స్థాయి, నైతికత మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కు లేదని టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ.యూసుఫ్‌జానీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోని గాదరి కిశోర్.. జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్న మంత్రి వెంకట్‌రెడ్డిపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

పత్తి కొనుగోలు చేయాలి

నల్లగొండ టౌన్: సీసీఐ కేంద్రాల్లో తేమ పేరుతో పత్తిని కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు తమ పత్తిని వ్యాపారులకు విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. సీసీఐ కేంద్రాల్లో పత్తిని కొనుగోలు చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఓటుహక్కు నమోదుపై అవగాహన

మునుగోడు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు నూతనంగా ఓటు హక్కు పొందాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గేర నర్సింహ కోరారు. బుధవారం మునుగోడులోని జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఓటుహక్కు నమోదుపై ఉపాధ్యాయులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బిక్కుమల్ల రాములు, గోరెంట్ల సుధాకర్, సుధాకర్‌రెడ్డి, సంజీవయ్య, గురుకుల పాఠశాల హెచ్‌ఎం సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలు కొనసాగిద్దాం

నల్లగొండ టౌన్: చేతి వృత్తుల పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాలు కొనసాగిద్దామని వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా నాయకుడు బండ శ్రీశైలం పిలుపు నిచ్చారు. బుధవారం దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వృత్తిదారుల కోసం కేటాయించిన బడ్జెట్‌ను వారి సంక్షేమం కోసం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గంజి మురళీధర్, అవిశెట్టి శంకరయ్య, కందగట్ల గణేశ్, చెరుకు పెద్దులు, సత్యనారాయణచారి, లింగయ్య, ధనుంజయ, గోపాల్, యాదయ్య, సత్తయ్య, వీరయ్య, దశరథ, శ్రీరంగం, రవి, అంజయ్య పాల్గొన్నారు.

యూజీడీ పనులకు శంకుస్థాపన


పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్లు

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని 35వ వార్డు హనుమాన్‌నగర్‌లో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులను బుధవారం బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్, స్థానిక కౌన్సిలర్ గుర్రం ధనలక్ష్మీవెంకన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం ద్వారా కాలనీలో మురుగు సమస్య తీరుతుందన్నారు. పనులు నాణ్యతతో చేపట్టి త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

సీసీఐ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


మునుగోడులోని పత్తి మిల్లులో పత్తిని పరిశీలిస్తున్న ఆర్డీఓ సుబ్రహ్మణ్యం

మునుగోడు: రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందించేందుకు స్థానిక జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని చండూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం కోరారు. బుధవారం మునుగోడులోని పలు జిన్నింగ్ మిల్లుల్లోని రైతుల పత్తిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చండూరు డివిజన్ పరిధిలోని నాలుగు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అందులో మునుగోడు మండలంలో మూడు, చండూరు మండలంలో ఒకటి చొప్పున ఉన్నాయన్నారు. రైతులు తమ పత్తిని 8 శాతం తేమ ఉండేటట్లు తీసుకొస్తే ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.7521 మద్దతు ధర అందుతుందన్నారు. అధికంగా తేమ ఉంటే కొనుగోలు కేంద్రాల్లో పత్తి కొనుగోలు చేయరన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.నరేందర్, మండల వ్యవసాయ అధికారి పద్మజ, సీసీఐ కొనుగోళ్ల ఇన్‌చార్జ్ బాలచందర్, మిల్లు యజమానులు, రైతులు తదితరులు ఉన్నారు.


కేతేపల్లి : కొర్లపహాడ్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ పురుషోత్తం

దళారులకు పత్తి అమ్మవద్దు

నాంపల్లి : రైతులు పండించిన పత్తి పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని తహసీల్దార్ దేవ్‌సింగ్ రైతులకు సూచించారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చండూర్, మర్రిగూడెం, చింతపల్లి, కొండమల్లేపల్లి మండలాల్లో సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు.

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

కేతేపల్లి: రైతులు పత్తి విక్రయించే విషయంలో దళారులను ఆశ్రయించి మోసపోవద్దని మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం అన్నారు. పత్తి విక్రయాలపై బుధవారం కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పత్తికి రూ.7521 మద్దతు ధర ప్రకటించినందున సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. నిబంధనల ప్రకారం పత్తిలో 8–12 తేమ శాతం ఉండేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. మరో రెండు రోజుల్లో వర్షాలు పడే సూచనలు ఉన్నందున్న ఇప్పటికే కోసిన పత్తిని ఆరబెట్టుకుని సీసీఐ కేంద్రాల్లో విక్రయించాలన్నారు.

అంబేద్కర్ భవన్‌లో ఆదర్శ వివాహం

నల్లగొండ టౌన్: అంబేద్కర్ భవన్‌లో బుధవారం కులాంతర వివాహితుల సంక్షేమ సంఘం, సామాజిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదర్శ వివాహం జరిగింది. పెద్దవూర మండలం దళిత సామాజిక వర్గానికి చెందిన హరిప్రసాద్, నకిరేకల్‌లోని బీసీ సామాజిక వర్గానికి చెందిన రాజేశ్వరి వివాహం చేసుకోవడానికి కులాంతర వివాహితుల సంక్షేమ సంఘాన్ని ఆశ్రయించడంతో వివాహం జరిపించారు. కార్యక్రమంలో మూఢనమ్మకాల నిర్మూలన సంఘం జాతీయ అధ్యక్షుడు బైరి నరేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ బొర్ర సుధాకర్, కులాంతర వివాహితుల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి దున్న యాదగిరి, కేవీపీఎస్ కార్యదర్శి పాలడుగు నాగార్జున, పందుల సైదులు, కొండేటి శ్రీను, జనార్దన్‌గౌడ్, భిక్షమయ్య, లక్ష్మీనారాయణ, మురళి, రవీందర్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

చండూరు : ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదని గట్టుప్పల్ తహసీల్దారు కార్యాలయం ఎదుట బుధవారం తేరట్‌పల్లి గ్రామ లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. ఆ స్థలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారనే సమాచారంతో లబ్ధిదారులు స్థలంలోకి వాహనాలు రాకుండా జేసీబీతో గాతు తీయించారు. విషయం తెలుసుకున్న ఆ గ్రామ రైతులు గాతును పూడ్చివేయించారు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవకు దారి తీసింది. ఇటు రైతులు..అటూ లబ్ధిదారులు స్టేషన్‌లో ఎస్‌ఐ వెంకట్‌రెడ్డికి ఒకరిమీద మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు. అనంతరం తమకు కేటాయించిన స్థలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే సహించేది లేదని తహసీల్దారు కార్యాలయం ఎదుట లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు.


గట్టుప్పల్ తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


నకిరేకల్ : మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. నకిరేకల్‌లోని ఏరియా ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అనేక సంక్షేమ పథకాలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు ఈ పథకాలు ఉపయోగపడతాయన్నారు. నకిరేకల్‌లోని ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితా శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ శోభారెడ్డి, మెప్మా ఇన్‌చార్జ్ సీహెచ్ పద్మ, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లలో ఓపెన్ హౌజ్


నల్లగొండ క్రైం : ఓపెన్ హౌజ్‌లో ఆయుధాలను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ


నల్లగొండ క్రైం : తుపాకులు పట్టుకుని గురి చూస్తున్న విద్యార్థులు

నల్లగొండ క్రైం: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ రాములు నాయక్ ఆధ్వర్యంలో ఓపెన్ హౌజ్ నిర్వహించారు. ఆయా పాఠశాలల విద్యార్థులకు అనేక అంశాలపై పోలీసులు అవగాహన కల్పించారు. విధి నిర్వహణలో పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, బాంబ్ డిటెక్టర్ పరికరాలు, పోలీస్ డాగ్స్ పని తీరు, ఫింగర్ ప్రింట్, క్లూస్ టీం, షీటీం, భరోసా, కమాండ్ కంట్రోల్ రూం, సీసీ కెమెరాలు, గంజాయి మత్తు పదార్థాలకు సంబంధించిన కిట్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సైబర్ నేరాల వలలో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలు సేవించడం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, భవిష్యత్‌లో జరిగే పరిణామాలు, డయల్ 100 ఉపయోగం, సీసీ టీవీల ప్రాముఖ్యత పోలీస్ కళాజాతా బృందం ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ రమేష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఆర్‌ఐలు సంతోష్, శ్రీను, ఆర్‌ఎస్‌ఐలు కళ్యాణ్ రాజ్, రాజీవ్, సాయిరాం, నాగరాజు, శ్రావణి, మమత, సిబ్బంది పాల్గొన్నారు.

తిప్పర్తి : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో పోలీస్ ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గౌతమ్ పాఠశాల విద్యార్థులకు తిప్పర్తి ఎస్‌ఐ సాయి ప్రశాంత్ పోలీసుల పనితీరు, విధుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఉమ, సిబ్బంది రమేష్, రాజీవ్, వసీం, సలీం తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ దగ్గుల క్రాంతికుమార్ ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ విధులు, ఆయుధాలపై నార్కట్‌పల్లి హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హైస్కూల్ పీఈటీ బండారు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

నాంపల్లి : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఎస్‌ఐ శోభన్‌బాబు విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండ క్రైం : మెటల్ డిటెక్టర్లపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు


వాకీటాకీలపై విద్యార్థులకు అవగాహన


నల్లగొండ క్రైం : బ్యాగ్‌లో మాదక ద్రవ్యాలను గుర్తిస్తున్న పోలీస్ డాగ్


తుపాకుల గురించి వివరిస్తున్న పోలీసులు


నార్కట్‌పల్లి : అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ


తనిఖీలు ఎలా చేస్తారో వివరిస్తున్న పోలీసులు

అంతర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీలకు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులు

నల్లగొండ రూరల్: తమిళనాడులోని ఎస్‌ఆర్‌ఎస్ యూనివర్సిటీలో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలకు బుధవారం మహాత్మగాంధీ యూనివర్సిటీలో క్రీడా జట్లను ఎంపిక చేశారు. 12 మంది క్రీడాకారులు ఎంజీయూ నుంచి ఎంపికయ్యారు. క్రీడాకారులను రిజిస్ట్రార్ రవి, ఓఎస్‌డీ అంజిరెడ్డి, స్పోర్ట్స్ సెక్రటరీలు మురళి, శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

కబడ్డీ కోచ్‌కు సన్మానం

నల్లగొండ టూటౌన్ : కబడ్డీ కోచ్‌గా ఉద్యోగ విరమణ పొందిన భాస్కర్‌రావును బుధవారం నల్లగొండ పట్టణంలో ఛత్రపతి శివాజీ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొమ్మపాల గిరిబాబు మాట్లాడుతూ కబడ్డీ కోచ్‌గా 30 సంవత్సరాలపాటు ఎంతోమంది క్రీడాకారులను తయారు చేసిన ఘనత భాస్కర్‌రావుది అని అన్నారు. కార్యక్రమంలో గచ్చిబౌలి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కబడ్డీ కోచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చిట్యాల: సుంకెనపల్లి గ్రామానికి చెందిన యాకారి కృష్ణ భార్య వనజ బుధవారం మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకుడు ఆవుల యాదయ్య పరామర్శించి వనజ భర్త కృష్ణకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. మాజీ సర్పంచ్ కక్కిరేణి బొందయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ యాకారి మారయ్య తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో అభిషేకాలు

రామగిరి (నల్లగొండ): శివుడి జన్మ నక్షత్రం అయినా ఆరుద్ర నక్షత్రం సందర్భంగా బుధవారం స్థానిక తులసీనగర్ భక్తాంజనేయ ఆలయ సన్నిధిలో గల శివాలయంలో అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ కుశలయ్య, ఆలయ అర్చకులు హరీష్‌కుమార్, శివప్రసాద్ శర్మ, హనుమంతాచార్యులు, భక్తులు చొక్కారపు మాధవి, రమాదేవి, గుండా ర మేష్, భాస్కర్ పాల్గొన్నారు.

పుస్తకాల బహూకరణ

శాలిగౌరారం: మండలంలోని మనిమద్దె జెడ్పీ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి గ్రామానికి చెందిన కొల్లోజు లలిత–చంద్రశేఖర్ దంపతులు రూ.10 వేల విలువ కలిగిన పుస్తకాలను స్థానిక అంగన్‌వాడీ టీచర్ శంకరమ్మ ఆధ్వర్యంలో బుధవారం బహూకరించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ మహాత్ముల జీవిత చరిత్రలు, కథల పుస్తకాలతోపాటూ వివిధ రకాల పుస్తకాలను అందజేశామని తెలిపారు.

పీఏసీఎస్ కేంద్రాల పరిశీలన

నల్లగొండ: మున్సిపాలిటీ పరిధిలోని ఆర్జాలబావి, చర్లపల్లిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎం హరీష్ పరిశీలించారు. ఇప్పటి వరకు జిల్లాలో 375 కేంద్రాలు ఏర్పాటు చేశామని, సన్న వరి ధాన్యం కొనుగోలు కోసం ప్రత్యేకంగా 80 కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని ఆదేశించారు.


కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

ప్రధాన రోడ్డు ఇలా.. ప్రయాణించేదెలా !


నాంపల్లిలోని అంబేద్కర్ చౌరస్తాలో బురదమయంగా ఉన్న రోడ్డు

నాంపల్లి : కాస్త వర్షం పడితే చాలు.. రోడ్డుపై నీరు నిలిచి రోడ్డంతా బురదమయంగా మారి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో సంబంధిత అధికారులకు, పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు వినతులు అందించినా ఫలితం మాత్రం శూన్యమని గ్రామస్తులు వాపోతున్నారు. వర్షం వస్తే నాంపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్, తహసీల్దార్, ఎస్టీఓ, పాఠశాలలకు వెళ్లే ప్రధాన రోడ్డు, అంబేద్కర్ విగ్రహం వెనుక నుంచి గ్రామీణ బ్యాంక్‌కు వెళ్లే దారిలో ఫీట్ లోతు నీరు నిలుస్తోంది. అందులో గుంతలు ఉండడంతో వాహనాదారులు కింద పడి గాయాలపాలవుతున్నారు. నిత్యం అధికారులు ఆ రోడ్లపై నుంచి వెళ్తున్నా కనీసం మరమ్మతులు చేసే ప్రయత్నం కూడా చేయడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇందిరమ్మ కమిటీని అఖిలపక్ష కమిటీగా మార్చాలి

నల్లగొండ టౌన్: ఇందిరమ్మ కమిటీల్లో అన్ని పార్టీలకు, మహిళా సంఘాలకు, స్వచ్ఛంద సంస్థలకు అవకాశం కల్పిస్తూ అఖిలపక్ష కమిటీలుగా మార్చాలని సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు నారి ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీలను కాంగ్రెస్ కమిటీలుగా మారుస్తూ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఎండగట్టాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చినవిధంగా ఇళ్లులేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించాలని, అర్హులైన వారికి పెన్షన్లు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో దండంపల్లి సత్తయ్య, కన్నెకంటి సత్యనారాయణ, ప్రసాద్, సౌమ్య, నారి లక్ష్మీ, మహేష్, అప్పయ్య, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.